క్లుప్తంగా

పది విద్యార్థులకు వీడ్కోలు సమావేశం



మాట్లాడుతున్న ముర్వత్‌బాషా

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మంగళం పేట ఉన్నత పాఠశాలలో శనివారం పదోత రగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీఎస్ కన్వీనర్ ముర్వత్‌బాషా మాట్లాడుతూ పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ మార్కులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నాగరాజప్రసాద్, స్కూల్‌కమిటీ చైర్మన్ మస్తాన్, ప్రధానోపాధ్యాయుడు ఫజురుల్లా, లక్ష్మీపతి, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

4న వలంటీర్లకు సన్మానం

పుంగనూరు : పట్టణంలోని 16 సచివాలయాల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న 202 మంది వలంటీర్లకు ఈనెల 4వ తేదీన మున్సిపల్ కార్యాలయంలో సన్మానం చేయనున్నట్లు కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఉత్తమ పనితీరు కనబరచిన వలంటీర్లకు సేవ వజ్ర, సేవరత్న, సేవమిత్ర అవార్డులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కౌన్సిలర్ల ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందని, పెద్దసంఖ్యలో ప్రజలు హాజరుకావాలని కోరారు.

మాజీ ఎంపీపీ మయూర్‌నాథ్‌కు నివాళి



మయూర్‌నాథ్ (ఫైల్)

పుంగనూరు : ఉమ్మడి చిత్తూరు జిల్లా రామసముద్రం మాజీ ఎంపీపీ మయూర్‌నాథ్ (86) అనారోగ్యంతో తిరుపతిలో చికిత్సపొందుతూ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీ రెడ్డెప్ప వెంటనే ఆయన ఇంటికి వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించారు. మయూర్‌నాథ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ క్రమంలోనే అన్ని పార్టీలకు చెందిన పలువురు నాయకులు, పెద్దసంఖ్యలో ప్రజలు సాయంత్రం నిర్వహించిన అంత్యక్రియలకు తరలివచ్చారు.

బెంగళూరుకు వెళ్లి పింఛన్ పంపిణీ




వృద్ధురాలికి నగదు అందిస్తున్న వలంటీర్ సంధ్య

పుంగనూరు : పట్టణంలోని 9వ వార్డులో పనిచేసే వలంటీర్ సంధ్య శనివారం బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సరస్వతి అనే వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేశారు.కౌన్సిలర్ అమ్ము సూచన మేరకు వలంటీర్ బెంగళూరుకు వెళ్లి పెన్షన్ పంపిణీ చేయడంపై పలువురు అభినందించారు.

8న మహిళా సదస్సు

పలమనేరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 8వ తేదీన పట్టణంలోని కళామందిరంలో సదస్సు నిర్వహించనున్నారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి, జాయినింగ్ ద డాట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకుడు తులసీనాథం నాయుడు శనివారం తెలిపారు. మహిళలు- ఆర్థిక స్వావలంబన అంశంపై చర్చ, వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన మహిళామణులను సత్కరించనున్నట్లు వెల్లడించారు.

ఉద్యోగ విరమణ సత్కారం



సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

పలమనేరు : మండలంలో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు బాలాజీరావు, మణిమాల, బాబుసాహెబ్‌ను స్థానిక ఎమ్మార్సీలో శనివారం ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ లీలారాణి హాజరై వారి సేవలను కొనియాడారు. ఇలాంటి గురువులను ఆదర్శంగా తీసుకోవాలని కార్యక్రమానికి విచ్చేసిన ఎస్టీయూ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్, ఆప్టా నేతలు సూచించారు.

ఘనంగా గంధం మెరవణి



గంధం ఊరేగింపు

బైరెడ్డిపల్లి : బైరెడ్డిపల్లె ఉరుసు మహోత్సవాల్లో భాగంగా శనివారం గంధం మెరవణి ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన వాహనంలో గంధాన్ని ఊరేగించారు.

అందరి కళ్లెదుటే అభివృద్ధి



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట : పల్లెసీమల్లో సైతం ఆర్‌బీకేలు, సచివాలయాలు, విలేజ్ క్లినిక్ భవనాలు, సీసీ రోడ్లు, ఓవర్‌హెడ్‌ట్యాంకులతో అందరి కళ్లెదుటే అభివృద్ధి కనిపిస్తోందని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. శనివారం వి.కోటలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, ఆర్‌బీకే భవనాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా సిద్ధార్థనగర్, ఖాజీపేటలో రూ.20 లక్షల చొప్పున వెచ్చించి నిర్మించిన సీసీ రోడ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. కన్యకాపరమేశ్వరి వీధిలో రూ.6లక్షలతో నిర్మించిన సీసీరోడ్లును ప్రారంభించారు. అంబేడ్కర్ నగర్‌లో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనం, నెహ్రూ వీధిలో రూ.6 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. కరకట్ట వీధిలో రూ.25 లక్షలలో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. ముదిమడుగులో రూ.12 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, వినాయకనగర్ నందు రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, నారాయణ నగర్,బాలాజీ నగర్‌లో సీసీ రోడ్లను ప్రారంభించారు. కుప్పం రోడ్డు వద్ద రూ.5లక్షలతో నిర్మించనున్న పార్క్ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని కొనియాడారు. ప్రజలను నమ్మించి ద్రోహం చేసే చంద్రబాబును నమ్మకూడదని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రస్తుతం జగనన్న చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళితే చాలని వెల్లడించారు. కుల,మత, రాజకీయాలతో పనిలేకుండా పేదల జీవితాల్లో వెలుగులు నింపిన జగనన్నను మరోసారి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, వైస్ ఎంపీపీలు లక్ష్మన్ రెడ్డి, తమీమ్, సర్పంచ్ లక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, మండల కన్వీనర్ బాలగురునాథ్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ ధవనం భక్త, గోపిరెడ్డి, సర్పంచ్‌లు దామోదరం, శ్రీనివాసులు, ఉప సర్పంచ్ అక్మల్, నాయకులు సయ్యద్ షామీర్, కుమార్‌రాజా, శశికళ, ప్రతాప్ రెడ్డి, కృష్ణమూర్తి, పూలనాగ, పీఎస్ మంజునాథ్, హరికుమార్, మురళి, కృష్ణ, రమేష్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా సమష్టి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తం రెడ్డి

రొంపిచెర్ల: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి స్పష్టం చేశారు. శనివారం మండలంలోని గానుగచింత, మోటుమల్లెల, పెద్దమల్లెల పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికలను ప్రతి ఒక్కరూ సవాల్‌గా తీసుకుని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇబ్రహీంఖాన్, ఎంపీటీసీ సభ్యులు విజయశేఖర్, రమణమ్మ, నూలు రెడ్డెప్ప, సర్పంచ్‌లు హేమలత, జీవలత, నాగిరెడ్డి, బూత్ లెవల్ కన్వీనర్లు కరీముల్లా, భాస్కర్ రెడ్డి, శ్రీనాథనాయుడు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

పెద్దపంజాణి: మండలంలోని శంకర్రాయలపేట మహాత్మా జ్యోతీబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతికి సంబంధించి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జ్యోత్స్న తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు 3, 4 తరగతులను జిల్లాలోని ప్రభుత్వ (లేదా) ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పూర్తి చేసినవారు అర్హులన్నారు. తల్లిదండ్రుల ఆదాయం లక్ష రూపాయల లోపు ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 31వ తేది లోపు http:// mjpapbcwreis. apcfss. in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9515764818 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎంజేపీ గురుకుల పాఠశాలలో..

సదుం: స్థానిక ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎంట్రన్స్ టెస్ట్ రాసేందుకు ఈ నెల 31వ తేదీలోపు mjpapbcwrieis. apcfss. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.5వ తరగతికి ఏప్రిల్ 27న, ఇంటర్‌కు ఏప్రిల్ 13వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



మరమ్మతు పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి

పలమనేరు : పట్టణంలో వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి తెలిపారు. శనివారం గంటావూరు సమీపంలోని టెర్రకోట నుంచి స్థానిక డిగ్రీ కళాశాల వరకు నిర్మించిన ట్యాంకు మార్గంలో మరమ్మతు పనులను ఆమె పరిశీలించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ కాలువపల్లెలోని వైఎస్సార్ జలాశయంలో నీటినిల్వ తక్కువగా ఉండడంతో ముందుస్తుగా ఈ పనులను చేపట్టామని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, వైస్ చైర్మన్ రవి పాల్గొన్నారు.

రేపు పలు అభివృద్ధి పనులు ప్రారంభం

పెద్దపంజాణి: మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెంకటేగౌడ సోమవారం ప్రారంభోత్సవం చేయనున్నట్లు ఎంపీపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఉదయం 9గంటలకు శంకర్రాయలపేట, 9.30 గంటలకు శివాడి, 10 గంటలకు నిడిగుంట గ్రామాల్లో ఆర్‌ఓ ప్లాంట్లు ప్రారంభిస్తారన్నారు. 11గంటలకు చిన్నేపల్లిలో సిమెంట్ రోడ్డు, ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు, 11.30గంటలకు భద్రాచలంలో సిమెంట్ రోడ్డు, తుర్లపల్లి, కొళత్తూరు, పెద్దకాప్పల్లి సచివాలయ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్లు వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



మాట్లాడుతున్న డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి

రొంపిచెర్ల: రొంపిచెర్ల పోలీసుస్టేషన్‌ను డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి శనివారం రాత్రి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి నివేదిక అందించాలని ఆదేశించారు. రౌడీషీటర్లను బైండోవర్ చేయాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై పీడీ యాక్టు నమోదు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కృష్ణయ్య పాల్గొన్నారు.

పలమనేరు సబ్ డివిజన్‌లో పోలీస్ యాక్టు



మాట్లాడుతున్న డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి

పలమనేరు : పలమనేరు సబ్ డివిజన్‌లో ఈనెల 30వ తేదీ వరకు 30 పోలీస్ యాక్టు అమల్లో ఉంటుందని డీఎస్పీ మహేశ్వర్‌రరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో పలమనేరు, గంగవరం సీఐలు చంద్రశేఖర్, చినగోవిందుతో కలసి విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు 30 పోలీస్ యాక్టు విధించినట్లు వెల్లడించారు. రాజకీయపార్టీలు, ప్రైవేటు వ్యక్తులు, మతపరమైన కార్యక్రమాలకు ఇకపై తప్పకుండా ముందస్తు అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా బహిరంగ సభలు, సమావేశాలు, మైక్ సెట్లు లాంటివి ఏర్పాటు చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

'ఆప్టా' మునాఫ్‌కు సత్కారం



మునాఫ్‌ను సన్మానిస్తున్న డీఈఓ దేవరాజు

పలమనేరు : పట్టణానికి చెంది ఆప్టా ఉపాధ్యాయ సంఘం నేత మునాఫ్‌ను డీఈఓ దేవరాజు శనివారం ఘనంగా సత్కరించారు. జిల్లాలో ఉర్దూ పాఠశాలల అభివృద్ధికి మునాఫ్ చేస్తున్న సేవలను గుర్తించి సన్మానించినట్లు డీఈఓ వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు టీచర్లు మునాఫ్‌కు అభినందనలు తెలిపారు.

ఆర్‌బీకేల్లో ఈ-క్రాప్ నమోదు వివరాలు



మాట్లాడుతున్న ఏడీ అన్నపూర్ణాదేవి

పలమనేరు : డివిజన్ పరిధిలోని ఈ-క్రాప్ నమోదు వివరాలను ఆయా గ్రామాల ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచినట్లు ఏడీ అన్నపూర్ణాదేవి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ సంబంధిత వివరాలను రైతులు పరిశీలించుకుని ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 5వ తేదీలోపు ఆర్‌బీకేల్లోనే ఫిర్యాదు చేయాలని సూచించారు. పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలో మొత్తం 7,760మంది రైతులకు చెందిన 12,846 ఎకరాల్లో పంటలను నమోదు చేసినట్లు వివరించారు. వీటిలో ఎక్కడైనా తప్పులు ఉంటే రైతులు అర్జీ సమర్పించాలన్నారు. ఫిర్యాదులను ఆయా మండలాల ఏఓలు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇందులో తప్పులుంటే బ్యాంకులో పంట రుణాలు పొందేందుకు ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. అనంతరం పలమనేరు ఆర్‌బీకేలో ఈ-క్రాప్ నమోదుపై సామాజిక తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో ఏఓ సంధ్య పాల్గొన్నారు.

రోడ్ల సమస్య పరిష్కారంపై హర్షం



న్యాయమూర్తికి కృతజ్ఞతలు తెలుపుతున్న పీపీఎస్ నేతలు

పలమనేరు : పట్టణంలో రోడ్ల సమస్యల పరిష్కారంపై పలమనేరు పరిరక్షణ సమితి నిర్వాహకులు సుబ్రమణ్యం పిళ్లై, నరసింహులు, సిద్ధయ్య హర్షం వ్యక్తం చేశారు. శనివారం వారు మాట్లాడుతూ రోడ్ల సమస్యలపై గతంలో సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని, అప్పుడు కోర్టుకు వెళ్లి సీనియర్ సివిల్ జడ్జికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. న్యాయమూర్తి శ్రీనివాసరావు వెంటనే స్పందించి ఆయా శాఖలకు నోటీసుల జారీ చేయడంతో సమస్యలు తీరినట్లు వివరించారు. ఇందుకు సహకరించిన న్యాయమూర్తిని కలిసిన పీపీఎస్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

కంటి వైద్యశిబిరంలో 75 మందికి పరీక్షలు

పుంగనూరు : పట్టణంలోని రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శంకర్ ఐ ఆస్పత్రి వారు శనివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కో-ఆర్డినేటర్ నాగరాజు నేతృత్వంలో డాక్టర్లు షిఫా, భవానీ, రమ్య, యోషిక, దీపిక సుమారు 75 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా క్లబ్ సెక్రటరీ రాజారెడ్డి మాట్లాడుతూ శస్త్రచికిత్సలకు 27 మందిని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు అనిల్‌కుమార్, డాక్టర్ శరణ్, త్యాగరాజు, భాస్కర్‌జెట్టి, గణేష్, భాస్కర్, హరిప్రసాద్, వేణుగోపాల్, మునిరాజా పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

సాయిమందిరం వార్షికోత్సవం రేపు

సదుం : మండల కేంద్రంలోని సాయిమందిరంలో సోమవారం 20వ వార్షికోత్సవ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ నిత్యం ఆలయంలో పూజలు, హారతులు జరిపిస్తున్నట్లు చెప్పారు. ఏటా దసరా, గురు పౌర్ణిమ పర్వదినాల్లో విశేష పూజలు, అన్నదానం చేపడుతున్నట్లు వెల్లడించారు. వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

వి.కోట ఎస్‌ఐగా బాబు



వి.కోట: వి.కోట ఎస్‌ఐగా బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ మనోహర్ ఉద్యోగోన్నతిపై సీఐగా బదిలీపై వెళ్లారు. దీంతో చిత్తూరు నుంచి బాబు వి.కోటకు వచ్చారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు రక్షణకు చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ఇంటర్ పరీక్షకు 19 మంది గైర్హాజరు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కొత్తపేట నందవనం జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం 185 మందికి గాను 19 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ తులసీరామ్ తెలిపారు.

పోలియో నిర్మూలనే లక్ష్యం

- వాడవాడలా అవగాహన ర్యాలీ
- నేడే పల్స్‌పోలియో



బైరెడ్డిపల్లెలో..



పుంగనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్యాధికారులు, సిబ్బంది

పుంగనూరు : పోలియో వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారి జయేష్ కోరారు. శనివారం పట్టణంలోని కొత్తపేట వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్, హైస్కూల్‌లో హెచ్‌ఎం సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం రుద్రాణి, మెడికల్ ఆఫీసర్ రంజిత ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. డాక్టర్ జయేష్ మాట్లాడుతూ ఆదివారం నిర్వహించే పోలియో శిబిరాల్లో పుట్టిన పిల్లల నుంచి 5 ఏళ్లలోపు వారికి పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పట్టణంలో 37 పల్స్‌పోలియో సెంటర్లు ఏర్పాటు చేశామని, ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలియో చుక్కలు శిబిరాల్లో వేస్తామని వివరించారు.

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు పీహెచ్‌సీ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. మండలంలో దాదాపు 23సెంటర్లలో 3,960 మంది పిల్లలకు పోలియో చుక్కలను వేయనున్నట్లు వైద్యాధికారి జానకీరావు తెలిపారు. ర్యాలీలో హెల్త్ సూపర్‌వైజర్ శారద పాల్గొన్నారు.

చౌడేపల్లె : మండలంలో మొత్తం 4,849 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు డాక్టర్ పూజ తెలిపారు. ఈ మేరకు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు విజయ్‌చంద్ర, అరుణ్‌కుమార్ మాట్లాడుతూ 5 ఏళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఇందుకు తల్లితండ్రులు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రారంభం

పలమనేరు : పట్టణంలోని విద్యానగర్ ఎంపీపీ పాఠశాలలో ఆదివారం ఉదయం 8గంటలకు పల్స్‌పోలియోను ఎమ్మెల్యే వెంకటేగౌడ ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, వైస్ చైర్మన్లు, వార్డు కౌన్సిలర్లు హాజరవుతారని వెల్లడించారు.

శాంతిపురం : స్థానిక పీహెచ్‌సీ పరిధిలో ఆదివారం 3,458 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు 29 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి వంశీకృష్ణ తెలిపారు. సోమ, మంగళవారాల్లో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పోలియో డ్రాప్స్ వేయనున్నట్లు వెల్లడించారు.



పుంగనూరులో..



చౌడేపల్లెలో..



కల్లూరులో..